క్లుప్తంగా

నేడు రైతులతో సీఎం, మంత్రి ముఖాముఖి

శాయంపేట : నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతు భరోసా, ఇతర కార్యక్రమాలపై రైతులతో నేడు (మంగళవారం) ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నందున మండలంలోని గట్లకానిపర్తి, పెద్దకోడెపాక, శాయంపేట గ్రామాల్లోని రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఓ గంగాజమున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు సాయంత్రం 6 గంటలకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారం ప్రారంభం అవుతుందని రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మల్లన్న ఆలయంలో మాసశివరాత్రి పూజలు



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు : మల్లికార్జునస్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, స్వామివారి కల్యాణం, రుద్రహోమం, ఒగ్గు పూజారులచే పెద్దపట్నం వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు మధుకర్ శర్మ, వేద పండితులు విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నట్లు ఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు.

ఉమామహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామంలో శ్రీ ఉమామహేశ్వర స్వామి 8వ వార్షికోత్సవం సోమవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భూలక్ష్మీ, పోచమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి అమ్మవార్లకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శివపార్వతుల కళ్యాణాన్ని నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలోని పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే నిరుపేదలకు ఇళ్లు

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిరుపేదలకు ఇళ్లు నిర్మించడం సాధ్యమవుతుందని, గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కురాకుల రాజు అన్నారు. మండలంలోని ప్రగతి సింగారంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంలు నిర్మిస్తామని పేదోడిని మోసం చేసిందని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోరే రాజయ్య, గంగాడి ఆదిరెడ్డి, సుధాకర్, మూలగుండ్ల సందీప్ రెడ్డి, బోయిని లింగయ్య, చిలుకల రవి, పోలెపల్లి అశోక్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

నడికూడ : పరకాల–అంబాల–హనుమకొండ ప్రధాన రహదారి నుంచి కౌకొండ గ్రామంలోకి వచ్చే రోడ్డు గతంలో తారు ఉండగా పూర్తిగా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. నూతన రోడ్డు పనులు ప్రారంభించి పాత రోడ్డును తొలగించి కంకరపోసి అసంపూర్తిగా వదలడంతో వాహనదారులకు, గ్రామస్తులకు ఇబ్బందులు పడుతున్నామని, గతంలో కూడా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకపోయినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ధర్మ సమాజ్ పార్టీ నాయకులు చుక్క రత్నాకర్, కొట్టే ఏసెబు, కుమారస్వామి, సలీం పాషా, విష్ణు తదితరులు వినతిపత్రం అందజేశారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

- విద్యాసంవత్సరం ప్రారంభమైనా అదే పరిస్థితి
- ఇలా అయితే ప్రభుత్వ విద్య ఎలా?



పోచమ్మసెంటర్ వద్ద కూల్చివేసిన ప్రాథమిక పాఠశాల భవన స్థలం



గొల్లవాడ ప్రాథమిక పాఠశాల



పీఎస్‌లో ఆరుబయట పాఠం చెబుతున్న ఉపాధ్యాయురాలు(ఫైల్)

ఆత్మకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం..నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం అందిస్తున్నాము బడిలో చేరండి అంటూ ఉపాధ్యాయులు వాడవాడలా తిరిగి బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రచారం ముమ్మరం చేశారు. ఎలాగోలా విద్యార్థులను చేర్పించారు. అయితే సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రంలో పోచమ్మసెంటర్‌లో కేంద్ర ప్రాథమిక పాఠశాల, గొల్లవాడ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల పరిస్థితి అధ్వానంగా తయారైంది. పోచమ్మసెంటర్ వద్ద ఉన్న కేంద్ర ప్రాథమిక పాఠశాలను సబ్ సెంటర్ నిర్మాణం చేస్తామనే కారణంతో కూల్చివేశారు. ఈ పాఠశాలను గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో 66 మంది విద్యార్థులు ఉండగా తాజాగా మరో పది మంది బడిబాట పట్టారు. అయితే ఈ పాఠశాలలో ఐదో తరగతి వరకు నడుస్తుండగా ఇందులో ఎప్పుడో టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డిపెప్‌లో నిర్మించిన రెండు గదుల్లో తరగతులు నడుస్తున్నాయి. ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. గదులు సరిపడక ఆరుబయటే పాఠాలు చెబుతున్నారు. వర్షమొస్తే అంతే సంగతులు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిద్దామనే తల్లిదండ్రులకు నిరాశ కలుగుతుందని చెబుతున్నారు. అలాగే జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బీఆర్ఎస్ హయాంలో రెండేళ్ల క్రితం కిచెన్ షెడ్ నిర్మాణం చేపట్టి నిధులు రాకపోవడంతో మధ్యలోనే వదిలేశాడు. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులు వంటలు చేయడానికి విద్యార్థులు భోజనం చేయడానికి నానాతంటాలు పడుతున్నారు. విద్యా శాఖ అధికారులు, నాయకులు దృష్టి పెట్టాలని స్థానికులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మౌనం వీడి హింసను వ్యతిరేకించండి



కౌకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

నడికూడ: మౌనం వీడి హింసను వ్యతిరేకించడని సర్వోదయ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. సోమవారం మండలంలోని కౌకొండ గ్రామంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళ సాధికారత కోసం ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. సమాజంలో మహిళ సమానత్వం కోసం పాటు పడే వ్యవస్థలను నిర్మించుకో వాలని, స్త్రీ ,పురుషులు సమానంగా చూడాలన్నా రు. మహిళలు అత్యవసర పరిస్థితులో 100, 112 హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేయవచ్చు అని సూచించారు. అనంతరం మహిళలపై జరుగుతున్న హింసలను నివారించేందుకు మౌనాన్ని వీడండి హింసను వ్యతిరేకించండి నినాదంతో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సర్వోదయ ప్రతినిధులు, మహిళ సహాయత కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్స్, ఆశలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం

పరకాల: రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేసి ఇప్పటి వరకు రూ.1కోటి 49లక్షల 39వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న ప్రారంభమైన నిధులు పంపిణీ నేడు(మంగళవారం)తో 100 శాతం వ్యవసాయ భూములకు అందించడం గర్వంగా ఉందని రాజిరెడ్డి తెలిపారు.

టీబీ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



అంబాలలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కమలాపూర్ : టీబీ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అంబాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో టీబీ ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ లక్షణాలున్న అనుమానితులు 50 మంది నుంచి తెమడ సేకరించి పరీక్షలు నిర్వహించారు. టీబీకి గురైన వారి కుటుంబ సభ్యులు 10 మందిని ఎక్స్‌రే పరీక్షల నిమిత్తం హనుమకొండలోని టీబీ ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, క్షయవ్యాధిగ్రస్తులు సకాలంలో మందులు వాడితే వ్యాధి నయం అవుతుందన్నారు. ఈ నెల 24న గూడూరు, 25న కానిపర్తి, 26న మాదన్నపేట, 27న శనిగరం, 28న గుండేడు, 30న భీంపల్లిల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మానస, టీబీ నోడల్ పర్సన్ ప్రభాకర్, ఎస్‌టీఎల్ఎస్ జనార్దన్, ఎల్‌టీ చంద్రమౌళి, ఐసీటీసీ ఎల్‌టీ విజయ, ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు శన్ను, కవిత, సరళ, రమాదేవి, ఇందిర పాల్గొన్నారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పరకాల : బెస్ట్ అవైలబుల్ స్కీం(బీఏఎస్) పెండింగ్ నిధులు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ డిమాండ్ చేశాడు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్ సెల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీంలో చదువుతున్న నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మూడేళ్ల నిధులు విడుదల చేసి ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. నిధులు విడుదల చేయకపోవడంతో సంబంధిత(బీఏఎస్) విద్యాసంస్థలు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.210 కోట్ల నిధులు మంజూరు చేయని పక్షంలో పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎడ్లను దొంగిలించిన వ్యక్తి అరెస్ట్



నిందితుని అరెస్ట్ చూపుతున్న సీఐ రంజిత్‌రావు

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్‌కు చెందిన మాందాటి కుమరస్వామికి చెందిన రెండు ఎడ్లను ఈ నెల 19న దొంగిలించిన వ్యక్తిని సోమవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ రంజిత్‌రావు తెలిపారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన కుమారస్వామి ఎడ్లను ఈ నెల 19న ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని ఈ నెల 21 కుమారస్వామి పోలీస్ స్టేషన్‌లో ఫి ర్యాదు చేశా డు. దీంతో కానిస్టేబుల్స్ సతీష్, ఖలీద్‌లు దర్యాప్తు చేపట్టి పెద్దకోడెపాకకు చెందిన కోగిల రాజు రెండు ఎడ్లను దొంగిలించినట్లుగా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలి పారు. కానిస్టేబుళ్లకు సీఐ రివార్డు ప్రకటించి అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామశివారులో పేకాట ఆడుతున్నారని వచ్చిన పక్కా సమాచారం మేరకు స్థానిక ఎస్సై సాయిబాబు సిబ్బందితో వెళ్లి పేకాటస్థావరంపై దాడులు నిర్వహించారు. వారి నుంచి పేకముక్కలతో పాటు రూ.5,250 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీన పర్చుకొని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. గుడేల్ తిర్మల్‌రెడ్డి, కలపర్తి రవీందర్, చిర్ర హనుమాన్‌రెడ్డి, గోసగాని సదానందం, భగవాన్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం



శ్రావణి

ఎల్కతుర్తి : భీమదేవరల్లి మండలం ముత్తారం గ్రామానికి చెందిన మోకిడి వరుణ్‌కుమార్–శ్రావణి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డ కారణంగా ఈనెల 22న ఆదివారం ఇంట్లో నుంచి శ్రావణి ఎవ్వరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో వివాహిత తండ్రి గారంపల్లి చందర్‌రావు ఫిర్యాదు మేరకు ఎస్సై సాయిబాబు సోమవారం అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేలేరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై సురేష్ సోమవారం తెలిపారు. ధర్మసాగర్ మండలం నుంచి కమ్మరిపేటలో కానిస్టేబుళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇసుక తరలించడానికి అనుమతి ఉందా అని ప్రశ్నించగా డ్రైవర్ లేదని సమాధానం చెప్పడంతో ట్రాక్టర్‌ను పీఎస్ తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అర్హులకు డబుల్ బెడ్రూంలు పంపిణీ చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి
- నిరుపేదలతో కలిసి 'డబుల్' ఇళ్ల వద్ద సీపీఐ ఆందోళన
- తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ
- అక్కడే వంటావార్పు చేపట్టిన నిరుపేదలు



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కమలాపూర్ : ఇల్లు, ఇంటి స్థలం లేని అర్హులైన నిరుపేదలందరికి డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. ఇంటి స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్న ప్రభుత్వం ఇల్లు, ఇంటి స్థలం లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నిరుపేదలతో కలిసి సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద బైఠాయించి అక్కడే కట్టెల పొయ్యిపై టీ చేసుకుని సేవించారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ కమలాపూర్, మర్రిపల్లిగూడెం, గూడూరు గ్రామాల్లో గత ప్రభుత్వం 420 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి అక్కడ మౌలిక వసతులు కల్పించకుండా వాటిని అర్హులకు పంపిణీ చేయలేదన్నారు. ప్రజాప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిందని, ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇళ్ల స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ ఇల్లు, స్థలం లేని నిరుపేదల గురించి మాత్రం ఆలోచించడం లేదన్నారు. ఇప్పటికైనా మండలంలో నిర్మాణం పూర్తయిన 420 డబుల్ బెడ్రూంలో మౌలిక వసతులు కల్పించి అర్హులైన వారికి డబుల్ బెడ్రూంలు కేటాయించాలని, లేదంటే తామే అర్హులను గుర్తించి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తామని హెచ్చరించారు. సంబంధిత అధికారులు వచ్చి దీనిపై స్పష్టత ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించడంతో సమాచారం అందుకున్న తహసీల్దార్ సురేష్‌కుమార్ అక్కడికు చేరుకుని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయని, త్వరితగతిన ఆ పనులు పూర్తి చేయించి అర్హులకు కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల ముట్టడి చేస్తున్నారన్న సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద ఎత్తున అక్కడ మోహరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కు రాజుగౌడ్, మండల కార్యదర్శి నకీర్త ఓదెలు, కొలుగూరి బాలరాజు, మహేందర్, లక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

- జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి లింగయ్య



మాట్లాడుతున్న లింగయ్య

కమలాపూర్ : జూలై 4న హనుమకొండలో నిర్వహించే గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య పిలుపునిచ్చారు. జీఎంపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కాల్వ కుమారస్వామి, ఎల్లబోయిన రవీందర్‌తో కలిసి సోమవారం ఆయన మండలంలోని గుండేడు, ఉప్పల్, శనిగరం, కమలాపూర్ గ్రామాల్లో పర్యటించి గొల్ల, కురుమలను కలిసి మహాసభల ప్రచారం నిర్వహించారు. అనంతరం కమలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలకు మండలం నుంచి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు గొల్ల, కురుమలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో మేకల సదయ్య,రవీందర్, కుమార్, సతీష్, ఓదెలు, శ్రీనివాస్, తిరుపతి, సమ్మయ్య పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆలోచనలు యువతరానికి ఆదర్శం



పరకాల : నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సంతోష్‌కుమార్, నాయకులు



ఎల్కతుర్తి : భీమదేవపల్లి మండలం ముల్కనూర్‌లో..



ఆత్మకూరు: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పరకాల/ఎల్కతుర్తి/ఆత్మకూరు: మాజీ కేంద్ర మంత్రి, జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆలోచనలు నేటి యువతరానికి ఎంతో ఆదర్శనీయమైనవని బీజేపీ నాయకులు కొనియాడారు. సోమవారం ఆయా మండలాల్లో శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ త్యాగాలను మరువలేనివని అన్నారు. దేశ ఐక్యత కోసం యువత శ్రమించాలని కోరిన మహానాయకుడు శ్యాంప్రసాద్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత కోసం ప్రాణాలర్పించిన డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ధైర్యశాలి అని అన్నారు.అలాగే అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి, పట్టణ నాయకులు పాలకుర్తి తిరుపతి, మిడిదొడ్డి సరేష్, మారేడుగొండ భాస్కరాచారి. జిల్లా కౌన్సిల్ సభ్యుడు గట్టు వేణుగౌడ్, మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శులు బయ్య పైడి, రవ్వ శివప్రసాద్, మహిళామోర్చా అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలత, నాయకులు తోట మల్లేశం, స్వామి, సాంబయ్య, దశరథం, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రాజెక్టులతో ప్రశ్నించే తత్వం పెరుగుతుంది

ధర్మసాగర్ : విద్యార్థులు సైన్స్ ప్రాజెక్ట్ తయారు చేయడం వల్ల వారిలో శాస్త్రీయ దృక్పథం, అభిరుచి పెంపొంది ప్రశ్నించేతత్వం, సృజనాత్మకత, రీసెర్చ్ మెథడాలజీ, జట్టులో పనిచేసే భావన పెరుగుతుందని ఇన్‌చార్జ్ హెచ్ఎం ధర్మప్రకాష్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్సీఈఆర్టీ వారిచే ఇన్‌స్పైర్ స్కీములో ప్రతి సంవత్సరం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టుల నామినేషన్స్ కోసం సోమవారం లైవ్ ఇంటరాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి సైన్స్ ఉపాధ్యాయులు కవిత, సురేష్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. డాక్టర్ చాంద్ మైక్రో బయాలజీ ఆచార్యులు, సుస్థిర పర్యావరణం, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆటోమేషన్, బయోటెక్నాలజీ వ్యవసాయం గ్రామీణాభివృద్ధి, ప్రజారోగ్యం లాంటి రంగాల్లో వినూత్నంగా ప్రజల ఉపయోగార్థం ఎలాంటి సైన్స్ ప్రాజెక్టులు చేయవచ్చనే అంశాల నిజ ఉదాహరణలతో వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న మహిళలు

ధర్మసాగర్ : స్థానిక మోడల్ కాలనీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆ కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. సోమవారం మోడల్ కాలనీకి చెందిన మహిళలు గ్రామంలోని ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి తమ సమస్యలు విన్నవించారు. కాలనీలో తాగునీటి సరఫరాను సక్రమంగా చేయకపోవడంతో తాగునీటికి కాలనీవాసులు తంటాలు పడుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఉన్నతాధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- పర్వతగిరి సీఐ రాజగోపాల్



పర్వతగిరి: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్



ఎల్కతుర్తి: డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్



వేలేరు : మొక్క నాటుతున్న ఎస్సై సురేశ్

ఐనవోలు: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పర్వతగిరి సీఐ రాజగోపాల్ అన్నారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం సమాజంలో అతి పెద్ద సమస్యగా మారిందన్నారు. యువత వాటి బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువతలో మార్పు తీసుకురావడంతోనే డ్రగ్స్ వాడకం అరికట్టడం సాధ్యం అవుతుందన్నారు. అనంతరం స్కూల్ ఆవరణలో హరిత హారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎస్సై పస్తం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వద్ద స్థానిక పోలీసులు సోమవారం మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) నిర్మూలపై ఆటోడ్రైవర్లకు, యువతకు అవగాహన కల్పించారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలువాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

వేలేరు: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎస్సై సురేశ్ అన్నారు. సోమవారం గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు వాటికి నీరు పోసి సంరక్షించాలని అన్నారు. మొక్కలను పెంచడం ద్వారా సంమృద్ధిగా వర్షాలు కురుస్తాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రదోషకాల నందీశ్వర అభిషేకం

ఐనవోలు : ప్రఖ్యాత మల్లికార్జునస్వామి ఆలయంలో బహుళ త్రయోదశిని పురస్కరించుకుని సోమవారం అర్చకులు ప్రదోషకాల నందీశ్వర అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం నందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నందీశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి శనిగలు, పండ్లు నైవేద్యం సమర్పించారు. గర్భాలయంలో స్వామి వారికి, నందీశ్వరుడికి ఏక కాలంలో హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు మధుకర్ శర్మ, వేదపండితులు, అర్చకులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు.